క్లుప్తంగా

భూ ఆధార్ చేయించుకోవాలి



వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలు లబ్ధిదారులకు వర్తింప చేయుటకు కొత్తగా భూ ఆధార్ చేయించుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు భూ ఆధార్ చేయించుకోవాలని సూచించారు. ఈ భూ ఆధార్ ఉన్న వాళ్లకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ రుణాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాలు నేరుగా వర్తింప చేస్తారని తెలిపారు. కావున సమీపంలోని రైతు సేంద్రాలకు వెళ్లి ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని వివరించారు.

ఆలయ నూతన కార్యవర్గం



శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ నూతన కార్యవర్గం

కడప కల్చరల్ : స్థానిక ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయానికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ సమీపంలోని వెలిగండ్ల లక్ష్మయ్య ప్రాంగణంలో నూతన కమిటీ అధ్యక్షులు కల్యాసుధాకర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆలయ నూతన కమిటీ అధ్యక్షులుగా కల్యా సుధాకర్‌ను మరోమారు ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా టేకూరి పుష్పాంగధ, కోశాధికారిగా ఇడెం మల్లిఖార్జున, కార్యనిర్వణ కార్యదర్శిగా మోతుకూరు సుబ్బరాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఆమె సేవకు అర్పించి భక్తులకు సరైన వసతులు కల్పించగలమని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్ఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

కడప ఎడ్యుకేషన్ : ఆర్ఎస్ఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత గంజాయి మాదక ద్రవ్యాలతోపాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేసు యాదవ్, లాయర్ సూర్యవంశం యాదవ్, నాయకులు సుధాకర్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అందెల రవళి



నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కడప కల్చరల్ : కడప శిల్పా రామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ఆటపాటలతో అలరించారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే శాస్త్రీయ నృత్యాలు, జిల్లా ప్రత్యేకతలను చాటే జానపద నృత్యాలతోపాటు ఇటీవల పలు సినిమాల్లో విశేష ప్రాచుర్యం పొందిన పాటలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మిస్బా మూవీ ప్రతినిధులను, శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, ఫీల్డ్ సూపర్ వైజర్ మధుసూదన్ బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలను పరిశీలిస్తున్న పోస్టల్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో పాఠశాలల విద్యార్థులకు యూనివర్శల్ పోస్టల్ యూనియన్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ మాట్లాడుతూ ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ. 25 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేలు, మూడవ బహుమతి 5 వేలు ఇస్తామన్నారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే లెటర్ రైటింగ్ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అక్కడ గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి రూ. 25 వేలు, మూడవ బహుమతి రూ. 10 వేలు అందజేస్తామన్నారు. ఈ పోటీలను పోస్టల్ అధికారులు ఎంవివి భాస్కర్ రెడ్డి, సునీతమ్మ, మంచాల శివ, మునాఫ్, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

లక్ష్యం.. శత శాతం

- పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి
- ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- విద్యార్థుల ఇళ్లు నైట్ విజన్ చేస్తున్న ఉపాధ్యాయులు
- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం



కడప చెమ్మియాపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల



నైట్ విజన్‌లో భాగంగా విద్యార్థిని పరీక్షిస్తున్న హెచ్‌ఎం మేరీ



చెమ్మియాపేట బాలికల ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌ను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకం. భవిష్యత్తు బంగారుబాటలో నడవాలంటే ప్రతి విద్యార్థి ప్రతిభ నిరూపించు కోవాల్సిందే. కష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. అయితే పది పరీక్షలంటే విద్యార్థులకు కొంత భయం ఉటుంది. అటువంటి భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. దీంతోపాటు విద్యార్థులు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనే విషయాన్ని ప్రధానోపాధ్యాయులు మేరీ నైట్ విజన్ చేస్తూ ఆరా తీసున్నారు. ప్రతి రోజు ఒక విద్యార్థి ఇంటికి వెళ్లి పిల్లోళ్ల ఎలా చదువుతున్నారనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. పది పరీక్షలు ముగిసే వరకు టీవీలు, సెల్‌ఫోన్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలు మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నారు.

పదిలో 114 మంది పిల్లలు..

కడప చెమ్మియాపేట గంగాభవాని బాలికల హైస్కూల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 114 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. వీరంతా పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరితోపాటు ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటలకు వరకు స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఇంపార్టెంట్ బిట్స్, 1,2 మార్కులకు సంబంధించి అన్ని సబ్జెక్టు వారి పీరియడ్స్‌లో ప్రతి రోజు ఒక ప్రశ్న రాయించడం చేస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలను అమలు చేస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

జూలై నుంచే నైట్ విజన్

పదవ తరగతి విద్యార్థులు ఇంటి వద్ద ఏవిధంగా చదువుతున్నారనే విషయాన్ని పరిశీలించేందుకు ప్రధానోపాధ్యాయురాలు మేరీ గతేడాది జూలై నెల నుంచి నైట్‌విజన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఒక పదవ తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి అమ్మాయి ఎలా చదువుతుంది. టీవీ, సెల్ ఏమైనా చూస్తుందా, విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారనే విషయాలను క్షుణంగా పరిశీలించడంతోపాటు తల్లిదండ్రలకు కూడా అవగాహన కల్పించి పదవ తరగతి పరీక్షలు ముగిసే వరకు మీరు కూడా టివీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ విషయంలో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు.

ఉపాధ్యాయుల గైడెన్స్ బాగుంది



పది పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులంతా బాగా గైడ్ చేస్తున్నారు. ప్రతి రోజు ఆదనపు తరగతులను నిర్వహించడంతో పాటు ఫ్లిప్ టెస్టులను నిర్వహిస్తున్నారు. వచ్చిన మార్కులను బట్టి ప్రత్యేక దృష్టిని సారించి సలహాలు ఇస్తున్నారు.

– హరిణి , పదో తరగతి విద్యార్థి

ఐదు వందలకు పైనే..



పదవ తరగతిలో ఐదు వందలకుపైగా మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నా. సబ్జెక్టు పరంగా ఎలాంటి డైట్స్ ఉన్నా ఉపాధ్యాయులు తక్షణం స్పందించి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. బాగా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాను.

– మానస, పదో తరగతి విద్యార్థి

వెనుకబడిన వారిపై శ్రద్ధ



వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం , సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు పరంగా ఎలాంటి అనుమానాలున్నా వెంటనే నివృత్తి చేస్తున్నారు. దీంతో సబ్జెక్టు సులభంగా అర్థమౌతుంది.

– యువశ్రీ, పదో తరగతి విద్యార్థి

విద్యార్థుల స్థాయిని బట్టి..



ఎఫ్ఏ1, ఎఫ్ఏ2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా గ్రేడ్లుగా విద్యార్థులను విభజించాం. వారి అభ్యసనా సామర్థ్యాన్ని బట్టి బోధిస్తున్నాం. దీంతోపాటు పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు సడన్‌గా వెళ్లి నైట్ విజన్ చేస్తున్నాము. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– మేరీ, ప్రధానోపాధ్యాయురాలు

తల్లి ప్రేమ విలువ తెలిపిన లూర్దుమాత



దైవ సందేశం అందజేస్తున్న రెవరెండ్ పాదర్‌కాసు లూర్దు

కడప కల్చరల్ : లూర్దుమాత లోకంలో తల్లి ప్రేమకు గల విలువను ప్రజలందరికీ తెలియజెప్పారని రెవరెండ్ పాదర్‌కాసు లూర్దు అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా 8వరోజు ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారిని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాదర్ కాసు లూర్దు మాట్లాడుతూ లూర్దుమాత కేవలం ప్రభువైన ఏసుక్రీస్తుకు మాత్రమే తల్లి కాదని, తనను విశ్వసించిన వారందరినీ ఆదరించి వారికి తల్లి ప్రేమను పంచి పెట్టారని తెలిపారు. దీనికి స్పందించిన క్రీస్తు తన తల్లి లోకమంతటికీ ప్రేమను పంచిపెట్టడం పట్ల ఎంతో గర్వించారని తెలిపారు. వికర్ జనరల్ తలారి బాలరాజు దివ్య బలిపూజ నిర్వహించారు. మౌలిక సంఘం సభ్యులు ప్రధాన వేదికపై క్రైస్తవ స్తుతి గీతాలను ఆలపించగా, ఆరోగ్యమాత గాయక బృందం పీఠాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో కళ్లు చెదిరేలా అలంకరించారు.



ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

ముగ్గురాయి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు జి.వెంకట సుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ముగ్గురాయి అక్రమ తవ్వకాలపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్నారు.దేశ సహజ సంపద అయిన ముగ్గురాయి అక్రమంగా తవ్వుతూ ప్రభుత్వానికి ఎటువంటి పెనాల్టీలు చెల్లించకుండానే కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, జిల్లా మైనింగ్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి, బీజేవైఎం నాయకులు పవన్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, ప్రధాన కార్యదర్శి లు సురేంద్ర, అశోక్ కుమార్, ప్రవీణ్ నాయుడు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ప్రభు కుమార్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగిరెడ్డి, కిరణ్, పాల్గొన్నారు.

అకాడమిలు చేయాల్సిన పని అలవోకగా!



పుస్తకావిష్కరణలో రచయితతో అతిథులు

కడప కల్చరల్ : అకాడమిలు చేయాల్సిన పనిని పుత్తా పుల్లారెడ్డి అలవోకగా చేయడం విశేషమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు కొంపెల్ల రామ సూర్యనారాయణ అన్నారు. రిటైర్డ్ ఇంజనీరు పుత్తా పుల్లారెడ్డి రచించిన శ్రీ లలితా నందిని వ్యాఖ్యతోగల జైమిని భారతం గ్రంథాన్ని అతిథులతో కలిసి వారు ఆవిష్కరించి పుత్తా లలితకు తొలి ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రంథాన్ని అందరికీ అర్థమయ్యేలా రచించడం పుత్తా సాహిత్య అభినివేశానికి నిదర్శనమన్నారు. అకాడమిలు చేయాల్సిన పనిని సామాన్య ఇంజనీరుగా పుత్తా పుల్లారెడ్డి చేయడం ఆయనకు ఆ రంగంలోగల ఆసక్తిని తెలుపుతోందన్నారు. పిల్లలమర్రి పినవీరభద్రుడు రచించిన జైమిని భారతాన్ని నేటి తరానికి పరిచయం చేసినందుకు అభినందనలు తెలిపారు. శతావధాని ఆముదాల మురళి రచయితను అభినందించగా, డాక్టర్ జీవీ సాయిప్రసాద్ సమీక్షించారు. రచయిత పుత్తా పుల్లారెడ్డి తన పుస్తక ప్రచురణకు కారకులైన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, పుత్తా వెంకట సుబ్బారెడ్డి, పుత్తా జయలక్ష్మి, డాక్టర్ సులోచనదేవి, సౌజన్య, డాక్టర్ రాజారామిరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మికులు తమకోసం రూపొందించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆర్కే విండోస్ సొల్యూషన్, దివిజ పాలిమర్స్, చౌడేశ్వరి పార్కింగ్ టైల్స్ ఇండస్ట్రీస్, సరోజినీ నగర్‌లోగల బ్రిక్స్ ఇండస్ట్రీ, జ్యోతి కెమికల్స్ సమీపానగల కన్‌స్ట్రక్షన్స్ వర్కర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ బాండెడ్ లేబర్ నిర్మూలన దినం ప్రాముఖ్యతను తెలియజేశారు. కడప అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి మరియు శైలజ, రెవెన్యూ అధికారులు, ప్యానల్ న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటరీలు, మేనేజ్మెంట్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు చేస్తే మెరుగైన విధానం తీసుకురావాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆప్కాస్ విధానం రద్దు చేస్తున్న రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రభుత్వం దాని కంటే మెరుగైన విధానాన్ని తీసుకురావాలి లేకుంటే ఆప్కాస్ లో ఉన్న ఉద్యోగులు అందరితో కలిసి ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని ఏపీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసి.బాదుల్లా హెచ్చరించారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయుసీ నగర అధ్యక్షులు పి సుబ్బరాయుడు, నాయకులు వెన్నం వాసుదేవరా, వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ మద్దిలేటి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిపోయినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు. నాయకులు రమేష్, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



విజేతలకు కప్, ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో గత నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న ఖేలో ఇండియాగేమ్స్‌లో భాగంగా అస్మిత ఫుట్‌బాల్ లీగ్ అండర్–15 పోటీలు ఆదివారంతో ముగిశాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆల్–ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ మద్దతుతో జరిగిన ఈ పోటీల్లో యంగ్‌బాయ్స్ ఎఫ్‌డబ్ల్యూఏ, యంగ్ మ్యాన్ ఎఫ్‌డబ్ల్యూఏ, పీలే లెవెన్స్, డానీస్ ఎఫ్‌సీ, ఎఫ్‌సీ, సీఎస్ఐఎఫ్‌సీ జట్లు పాల్గొన్నాయి. కాగా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురతోటి డానియల్ ప్రదీప్ మాట్లాడారు. ఖేలో ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను అస్మిత ఫుట్‌బాల్ లీగ్‌గా పిలుస్తారన్నారు. కడపనగరంలో ఈపోటీల నిర్వహణకు అవకాశం కల్పించిన ఏపీఎఫ్ఏ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్‌కు, పోటీలు సజావుగా సాగేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్‌కు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా ద్వారా దేశంలోని 22 రాష్ట్రాల్లో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో పోటీలను నిర్వహించుకునేందుకు స్పెషల్ ఆఫీసర్ కె.జగన్నాధరెడ్డి అనుమతివ్వడం వల్లే ఇక్కడ పోటీలను నిర్వహించుకోగలిగామన్నారు. ఈపోటీల్లో యంగ్‌బాయ్స్ క్లబ్ విన్నర్స్‌గా నిలవగా, ఎఫ్‌డబ్ల్యూఏ క్లబ్ రన్నర్‌గా నిలిచింది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో నున్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు రావాల్సిన 11వ పిఆర్సీ, కరువుబత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సిపియస్ ఉద్యోగులకు పెన్షనర్లకు కరువుబత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్లకు చెల్లించాల్సిన దాదాపు 25 వేల కోట్ల రూపాయల బకాయిలను ఎప్పుడు ఏ విధంగా చెల్లిస్తారో స్పష్టం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు పూర్తయినా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. సరెండరు లీవు బిల్లులు ట్రెజరీలకు సమర్పించి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఖాదర్ భాష, శ్రీనివాస రెడ్డి ,రాష్ట్ర కౌన్సిలర్లు గురయ్య, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, రామసుధాకర్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ పాఠశాలలను కొనసాగించాల్సిందే'

కడప ఎడ్యుకేషన్ : 117 జీవో రద్దు చేసే ప్రక్రియలో భాగంగా మూతపడనున్న ఉర్దూ మాధ్యమ పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండో అధికారిక భాషగా ఉన్న ఉర్దూ, సోదర భాషలైన కన్నడ, ఒడియా , తమిళ భాషలకు కూడా సముచిత స్థానం కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1390 ఉర్దూ మాధ్యమ పాఠశాలలపై 117 రద్దు కారణంగా తీవ్ర ప్రభావం పడుతోందని, జీవో రద్దు చేసినప్పటికీ ఉర్దూ మాధ్యమ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఎటువంటి ఆటంకం కలగకుండా యధావిధిగా కొనసాగించాలన్నారు. తమిళనాడు , మహారాష్ట్ర , పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో తెలుగు మాధ్యమ పాఠశాలలు కూడా ఉన్నప్పుడు, మన రాష్ట్ర రెండో అధికార భాష అయిన ఉర్దూ మాధ్యమ పాఠశాలలను విలీనం చేయడం తగదని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల్లో మన తెలుగు భాషకు సముచిత స్థానం కల్పిస్తున్నప్పుడు మన రాష్ట్రంలో కూడా ఉర్దూ , కన్నడ, తమిళ్ , ఒడియా మాధ్యమ పాఠశాలలను సముచితస్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ పాఠశాలలు మూతపడడం లేదా విలీనం చేయడం వలన అందులో చదువుతున్న మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కావున ఉర్దూ మాధ్యమ పాఠశాలలతో పాటు ఇతర భాషా మాధ్యమాల పాఠశాలల విలీన ప్రక్రియ తక్షణమే ఆపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

శాంతియుత జీవితం దైవ సమ్మతం

కడప కల్చరల్ : ప్రజలు శాంతియుతమైన జీవితాన్ని గడపడమే దైవానికి ఇష్టమని పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ అన్నారు. ఆదివారం స్థానిక న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో వారు శాంతియుత ప్రపంచం, ప్రజా సంక్షేమం కోసం విశ్వాసులతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రపంచమంతటా యుద్ధమయంగా మారిందని, ప్రపంచమంతటా శాంతి మార్గంలో నడవాల్సిన అవసరాన్ని ఇది గుర్తు చేస్తుందన్నారు. ప్రధానంగా యువత శాంతి మార్గంలో పయనించి అటు దైవానికి దగ్గర కావడంతోపాటు తాము నివసిస్తున్న లోకాన్ని శాంతిమయంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు పి.రవితేజ, నరసయ్య, శాంతిరాజు, రోజా, శ్యామల, సుగుణమ్మ, లక్ష్మి, సుంకమ్మ, అక్కమ్మ, ఎల్లమ్మ, దూపం మహేష్, మీనా, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

[illegible]

[illegible]

మను అభివృద్ధికి కృషి చేయాలి



కళాశాల సిబ్బందితో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్

కడప ఎడ్యుకేషన్ : మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ సూచించారు. మను పాలిటెక్నిక్ కళాశాలను స్కూల్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్, సమాన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సీఈఓ సమాన మౌసవిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు కళాశాల పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. కళాశాల సమస్యలు, అభివృద్ధి, మరియు విద్యార్థుల సంఖ్య పెంపుపై చర్చించారు. రాబోయే అకడమిక్ సంవత్సరానికి అడ్మిషన్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని డీన్ సూచించారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం చక్కటి మార్గాలను సిద్ధం చేయాలని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మిర్జా విలాయత్ అలీ బైగ్ కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మోహమ్మద్ సికందర్ హుస్సేన్, డాక్టర్ అబ్దుల్ అల్తాఫ్ హుస్సేన్, ఇర్ఫాన్ మరియు యూనస్ పాల్గొన్నారు.